క్లుప్తంగా

బాలిక చదువుకు అండగా ఆర్థిక సాయం



బాలికకు చెక్కు అందజేస్తున్న అవని స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు శిరీష

ఆల్విన్‌కాలనీ: పేద బాలిక విద్య కోసం అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఆర్థిక సహాయ చెక్కును బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని పేద బాలికల విద్య కోసం అవసరమైన సదుపాయాలు ప్రభుత్వం ద్వారా అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవని స్వచ్ఛంద సంస్థ నుంచి బాలిక విద్య కోసం సహాయం చేసిన శిరీషను ఆయన అభినందించారు.

అడ్డంకులు సృష్టిస్తున్నారు

● ప్రొ.అన్సారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులు ప్రతి విషయంలోనూ అడ్డంకులు సృష్టిస్తున్నారని విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు. నోడ్యూస్ సర్టిఫికెట్ కోసం ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీలో చేపట్టిన దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఉద్యోగంలో చేరి నాటి నుంచి పదవీ విరమణ వరకు ఓయూ అధికారులు అనేక విషయంలో ఇబ్బందులు పెడుతూనే ఉన్నారన్నారు. తనకు మూడు సంవత్సరాల క్రితం ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించినా అసోసియేట్ ప్రొఫెసర్ వేతనాన్ని చెల్లిస్తున్నారని వివరించారు. ఉద్యోగ విమరణ చేసి ఐదు నెలలు గడుస్తున్న ల్యాప్ టాప్ బాకీ ఉందనే నెపంతో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు.

సీతాఫల్‌మండి పాఠశాల ఓయూకు తరలింపు

ఉస్మానియా యూనివర్సిటీ: సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ హై స్కూల్‌ను ఓయూ క్యాంపస్‌లోని మోడల్ స్కూల్‌కు తరలించారు. కొత్త భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంల ఏడాది పాటు సీతాఫల్‌మండి స్కూల్ ఓయూలో కొనసాగనుంది. ఉదయం 7 నుంచి 12.30 వరకు హై స్కూల్, మధ్యాహ్నం 1 నుంచి 4.30 వరకు ప్రాథమిక విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు.

ఉద్యోగాల పర్మనెంట్ కోసం మంత్రులతో సంప్రదింపులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలంగాణ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ డాక్టర్ పరుశురామ్ తెలిపారు. రాష్ట్రంలోని 12 వర్సిటీలకు చెందిన కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ నేతలు నేతృత్వంలో ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి ఉద్యోగాల పర్మనెంట్ కోసం సీఎం కేసీఆర్‌కు లేఖలు రాయాలని కోరుతున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల వరకు వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేసేలా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు పరుశురామ్ పేర్కొన్నారు.

'సేవ్ ఓయూపై' నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: సేవ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం అనే అంశం పై నేడు (15న) సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10.30 నిమిషాలకు రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆకునూరి మురళి, ప్రొ.హరగోపాల్, ప్రొ.కోదండరామ్, ప్రొ.అన్సారీ, ప్రొ.రమామేలొకటే తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

సనత్‌నగర్: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ వివరాల ప్రకారం..మంగళవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మద్యం తాగి మొదటిసారి ఇద్దరు, రెండోసారి ఇద్దరు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా వారికి జైలు శిక్ష విధించారు.

'నీట్'లో రాణించిన గురుకుల విద్యార్థులు

రాయదుర్గం: 'నీట్'లో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటారు. బాలికల కళాశాలలో 80 మంది పరీక్షలు రాశారు. జి సంధ్యకు ఆలిండియాలో 90వ ర్యాంకు, పి ఝాన్సీ ఆలిండియా ర్యాంకు 10,683 సాధించారని ప్రిన్సిపల్ శారద తెలిపారు.

బాలుర కళాశాలలో..

గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు చేతన్ కుమార్ 511 మార్కులతో 3,789 ర్యాంకు, ఆర్ జైపాల్ 505 మార్కులతో 803వ ర్యాంకు, ఎంహర్షవర్దన్ 451 మార్కులతో 1955 ర్యాంకు సాధించారని ప్రిన్సిపల్ వి పాపారావు, వైస్ ప్రిన్సిపల్ గణేష్ పేర్కొన్నారు.

బడులు షురూ.. సమస్యలు చూడు!

సాక్షి ఫోకస్





లోపల, బయట చెత్త చెదారం

ఇదీ వెంకటేశ్వరనగర్‌లోని సర్కారు బడి దుస్థితి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో పాటు సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట వెంకటేశ్వర నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సుమారు 200 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. ఎక్కువగా ఈ పాఠశాలలో బాలికలే ఎక్కువగా చదువుతున్నారు. బాలురకు, బాలికలకు రెండు మాత్రమే మరుగుదొడ్లు ఉండటంతో మలమూత్ర విసర్జన చేయడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. టాయిలెట్స్‌లో కూడా దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు అసహ్యించుకుంటున్నారు.

◆ విద్యార్థులు పాఠశాలకు ప్రధాన గేటు ముందే చెత్త డంపింగ్‌గా జీహెచ్ఎంసీ కార్మికులు సైతం వాడుకుంటున్నారు. తద్వారా దుర్గంధం వెదజల్లుతూ ఈగలు, దోమలతో విద్యార్థులు సతమతమవుతున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అనేక మార్లు హెచ్చరించినా సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్తని ఇదే ప్రదేశంలో పడవేయటంతో పాఠశాలలో విద్యార్థులు కూర్చోలేని పరిస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో ఐదో తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు విద్యార్థులు. ఇక్కడ నలుగురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. ఒక తరగతి గది ఎప్పుడు ఖాళీగా ఉంటుందని వలంటీర్ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు. స్కూల్లో అటెండర్ లేకపోవడంతో పరిసరాల పరిశుభ్రత లోపించి చెత్తాచెదారం దుమ్ములతో పాఠశాల ప్రాంగణమంతా కొట్టుమిట్లాడుతోంది. ప్రతి రోజు ఉపాధ్యాయులే శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

స్కూల్‌లో వాచ్‌మెన్, అటెండర్ లేరు..



బబ్బుగూడలోని ప్రభుత్వ పాఠశాల

మోతీనగర్: మూసాపేట అల్లాపూర్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. బబ్బుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు తరగతులు 300 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో తెలుగు ఇంగ్లిష్ మీడియం 10 సెక్షన్లు కొనసాగుతున్నాయి. 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వాచ్‌మెన్, అటెండర్‌లు లేరు. పలు సందర్భాల్లో విద్యార్థులే తరగతి గదులు శుభ్రం చేసుకుంటున్నారు. అదే విధంగా అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లో 200 మంది విద్యార్థులు ఉన్నారు. కొంతమంది వరండాలో విద్యను కొనసాగిస్తున్నారు.

మూత్రశాలలకు తలుపులు లేవు..

బాలానగర్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో సెలవుల బాట వీడి బడిబాట పట్టారు విద్యార్థులు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు అంతంత మాత్రమే. సర్కార్ పాఠశాలల్లో అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. బాలానగర్ డివిజన్ పరిధిలోని చెరబండ రాజు కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాల శ్లాబు పెచ్చులు ఊడిపడుతోంది. పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు అయినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పాఠశాలలో 45 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తగా 5 మంది విద్యార్థులు చేరారు. మూత్ర శాలలు ఉన్నా అవి ఉపయోగంలో లేవు. వాటికి తలుపుకు కూడా లేవు. పాఠశాల ఆవరణలో స్థానిక కాలనీ వాసులు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు పార్కింగ్ చేస్తున్నారు. పాఠశాలకు గేటు కూడా లేదు.





చరబండ రాజు కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, తలుపులు లేని మూత్రశాలలు



గౌతమ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న నడుస్తున్న ప్రభుత్వ పాఠశాల

ఈ పాఠశాలకు భవనం లేదు.. కమ్యూనిటీహాల్‌లోనే తరగతులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్‌లో నిర్వహించే పాఠశాలకు భవనం లేదు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో కమ్యూనిటీ భవనంలో పాఠశాలను నడుపుతున్నారు. దాంట్లో ఓ పక్కన కంటి వెలుగు, మరో పక్క కుట్టు శిక్షణా కేంద్రానికి సంబంధించిన మెషిన్లు ఉన్నాయి. దాంతో విద్యార్థులు క్రమ పద్ధతిలో కూర్చోలేక ఎక్కడ స్థలం ఉంటే అక్కడే కూర్చుంటున్నారు. మూత్రశాలలు లేవు. ఇక్కడ 120 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. అంతేకాకుండా ఇదే హాలులో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు ఒకే హాలులో విద్యనభ్యసిస్తున్నారు.

తరగతి గది లేక వరండాలోనే..



ప్రగతినగర్‌లోని పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థులు

కూకట్‌పల్లి డివిజన్ ప్రగతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తరగతి గదులు సరిపడ లేక లేకపోవడంతో వరండాలనోనే చదువు చెప్పాల్సి వస్తుందని తెలుపుతున్నారు. పక్కపక్కనే తరగతులు ఉండటంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ పాఠశాలలో ఇన్‌చార్జి మాత్రమే ఉన్నారు. హెడ్‌మాస్టర్‌ను ఏర్పాటు చేయాలి. ఉపాధ్యాయుల కొరత కూడా భర్తీ చేయాలని, టెంపరరీ టీచర్‌నైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జగద్గిరిగుట్ట రిక్షా పుల్లర్స్ కాలనీలో..

జగద్గిరి గుట్ట రిక్షా పుల్లర్స్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీని ఆనుకొని జీహెచ్ఎంసీ కార్మికులు సేకరించిన చెత్తాచెదారాన్ని రిక్షాల్లో ప్రతి రోజు డంపింగ్ చేస్తుండటంతో దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాల తరగతి గదుల్లో కూర్చోవాలంటే విద్యార్థులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కూడా ఇదే విధంగా చెత్తా చెదారం ఇక్కడే డంప్ చేయటంతో జ్వరాలు వచ్చి అనేక మంది విద్యార్థులు అవస్థలకు గురయ్యారని విద్యార్థుల తల్లి దండ్రులు పేర్కొంటున్నారు. దోమలు ఈగలు వృద్ధి చెంది రోగాల భారిన పడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అదే విధంగా ఈ ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. చేయవద్దని చెబితే దాడులకు దిగుతున్నారని తెలుపుతున్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ ప్రదేశంలో వాహనాల పార్కింగ్ చేయకుండా చూడాలని కోరుతున్నారు.





రిక్షాపుల్లర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకొని వాహనాల పార్కింగ్


ప్రధాని మోదీ దేశానికి సేవకుడు మాత్రమే



వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ నివాసానికి వచ్చిన తరుణ్‌చుగ్, తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ బుధవారం జన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఓటర్లను కలిసేందుకు ఆల్విన్‌కాలనీ డివిజన్ శాతవాహననగర్‌లోని వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను ప్రేమ్‌కుమార్‌కు వివరించారు. మోదీ దేశానికి యజమాని కాదని, సేవకుడు మాత్రమేనన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు అనేక కార్యక్రమాల ద్వారా దేశ ప్రజలకు సేవ చేస్తున్నారని వెల్లడించారు. భారత దేశం పేరు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా వినిపిస్తుందని, భారత్ విశ్వ గురువుగా మారిందని తరుణ్‌చుగ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పన్నాల హరీష్ రెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చందర్, వైద్య సిబ్బందితో ఎమ్మెల్సీ



ఘనంగా వైద్య ఆరోగ్య దినోత్సవం

● వైద్యులు, సిబ్బందికి సన్మానం

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం కూకట్‌పల్లి ఎన్ కేఎన్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు, యువతకు పరిశ్రమల ద్వారా ఉద్యోగ అవకాశాలు మాత్రమే కాకుండా, వైద్య ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గర్భిణులకు కేసీఆర్ కిట్లను అందిస్తోందన్నారు. అదే విధంగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో నూతన ఆస్పత్రులను నిర్మించి అత్యాధునిక సదుపాయాలు గల పరికరాలతో వైద్య ఆరోగ్యాన్ని బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు.

◆ ఎర్రగడ్డలో 1000 పడకల ఆస్పత్రి నిర్మాణం, నిమ్స్ ఆస్పత్రి విస్తరణ వంటి పనులతో ముందుకు వెళ్తున్నారని గుర్తు చేశారు. అదే విధంగా కూకట్‌పల్లిలో 100 పడకల ఆస్పత్రికి ఇటీవలే మంత్రి హరీష్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్నామన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వైద్యులు, సిబ్బందిని నవీన్‌కుమార్ చేతుల మీదుగా శాలువాతో సన్మానించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీ రవి కుమార్, డాక్టర్ చందర్, డాక్టర్ చంద్రకళ, ఏసీపీ చంద్రశేఖర్, నియోజకవర్గ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి మెమొంటోలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

సృష్టి ప్రోగ్రాంకి యశశ్రీ ఎంపిక

రాయదుర్గం: పూణె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ టెక్నాలజీ అండర్ గ్రాడ్యుయేట్ యశశ్రీ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని ఐహబ్ డేటా స్పాన్సర్ చేసిన సృష్టి ఇంటర్న్‌షిప్ స్కాలర్ షిప్‌ను గెలుచుకుంది. ఐహబ్ డేటా ద్వారా సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్ ఆన్ టెక్నలాజికల్ ఇన్నోవేషన్స్ (సృష్టి) ప్రోగ్రామ్ కింద ఐహబ్ డేటా అకడమిక్, రీసెర్చ్ స్కిల్స్‌ను మెరుగుపర్చటానికి దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ అండర్ గ్రాడ్యుయేట్ లనుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. అందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశారు.

అధికారంలోకి రాగానే యూత్ కమిషన్లను ఏర్పాటు చేస్తాం

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే యూత్ కమిషన్లను ఏర్పాటు చేసి రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలను అందిస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం ఇందిరమ్మ కాలనీలో ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ప్రజలు మోసం చేశాయన్నారు. ఈసారి ఓట్లను అడిగేందుకు వచ్చే అధికార పార్టీ నాయకులను ప్రజలు ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పెద్దపీట వేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లో మహిళలకు సముచిత స్థానం

● టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: బాలానగర్‌లోని రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి నివాసంలో టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజానోళ్ల లక్ష్మి చేతుల మీదుగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన మహిళా బ్లాక్ డివిజన్ కమిటీ అధ్యక్షులకు బుధవారం నియామకపత్రాలు అందజేశారు. ఏ బ్లాక్ అధ్యక్షురాలిగా రమాదేవి, బి-బ్లాక్ అధ్యక్షురాలిగా శోభ, బోయినపల్లి డివిజన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, బాలానగర్ డివిజన్ అధ్యక్షురాలిగా రేణుక, కూకట్‌పల్లి అధ్యక్షురాలిగా కృష్ణవేణి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షురాలిగా మారుతీ, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షురాలిగా భారతమ్మను నియమించారు.

◆ ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. మహిళలకి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటూ సమాన గౌరవిస్తుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మంత్రి మండలిలో మహిళలకు ఎక్కువ స్థానాలను ఇచ్చి గౌరవం ఇచ్చిందన్నారు. వడ్డీలేని రుణాలను మహిళలకు అందించిందని గుర్తు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరి కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్ట పర్చాలని సూచించారు. మహిళలు రాజకీయాల్లో రాణించటానికి కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కృషి చేసిందన్నారు. మహిళలకు పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



కాంగ్రెస్ బ్లాక్, డివిజన్ నూతన అధ్యక్షులతో డా. సత్యం శ్రీరంగం, పుష్పారెడ్డి, రాజానోళ్ల లక్ష్మి

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కూకట్‌పల్లి: ఐటీ కన్సల్టెన్సీ సంస్థ నిర్వాహకుడి హత్య కేసులో నిందితుడికి కూకట్‌పల్లి 3వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, ఏడీజే కోర్టు జీవిత ఖైదు విధించడంతో పాటూ పదివేల రూపాయల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించింది. 2019లో జరిగిన ఈ హత్య కేసు పూర్వాపరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి.

28న అదృశ్యం.. 30న మృతి..

మూసాపేట ప్రాంతంలోని ఆంజనేయనగర్‌లో నివాసముండే సతీష్‌బాబు, కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజులో ఐటీ కన్సల్టెంట్ అనే సంస్థను నిర్వహిస్తున్నాడు. సతీష్ బాబు 2019 ఆగస్టు 28న రాత్రి 10 గంటల నుంచి కనిపించకుండా పోయాడని.. అతని రెండు మొబైల్ ఫోన్‌లు స్విచ్ ఆఫ్ ఉన్నాయంటూ అతని భార్య ప్రశాంతి 29వ తేదీన కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టారు. ఒకవైపు పోలీసులు, మరోవైపు సతీష్ బాబు కుటుంబ సభ్యులు, స్నేహితులు అతని ఆచూకి కోసం గాలింపు మొదలు పెట్టారు.

ముక్కలుగా చేయబడ్డ మృతదేహం స్వాధీనం..

30వ తేదీన 7వ ఫేజులోని ఎంఐజీ 98 గృహంలో సతీష్‌బాబు మృతదేహం ఉన్నట్లు గుర్తించిన అతని స్నేహితుడు కేతావత్ నవీన్‌కుమార్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు ఆ గృహం తలుపులు పగలగొట్టి ముక్కలుగా చేయబడ్డ సతీష్‌బాబు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మిస్సింగ్ కేసును హత్యకేసుగా నమోదు చేశారు.

నష్టాల పేరుతో జీతాన్ని తగ్గించటంతోనే హత్య..

దర్యాప్తులో హేమంత్‌మాతే ఐటీ సంస్థలో సహ నిర్వాహకుడిగా కొనసాగుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సతీష్ బాబును అంతమొందించేందుకు కుట్ర పన్ని హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని తీసుకొని విచారించగా హత్యకు గల అసలు విషయాలను తెలిపాడు. సతీష్ బాబుతో పాటు ఐటీ సంస్థలో నిర్వాహకుడిగా ఉన్నప్పటికి నష్టాల పేరుతో తన జీతాన్ని తగ్గించటం.. తన విధులను కొంత వరకే పరిమితం చేయటం.. తన పట్ల చిన్న చూపుగా వ్యవహరించటం వంటివి జీర్ణించుకోలేక సతీష్‌బాబును హత్య చేసినట్లు నిందితుడు వెల్లడించాడు.

ఇంట్లో మద్యం పార్టీ ఇచ్చి.. ఇనుప సుత్తితో మోది..

ఆగస్టు 28న రాత్రి 10 గంటలకు సతీష్‌బాబును తన గదికి పిలిపించుకొని ఇద్దరు మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న సతీష్‌బాబు తలపై ఇనుప సుత్తితో మోది హత్య చేసినట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు. అంతేకాకుండా సతీష్‌బాబు బాడిని మాయం చేసేందుకుగానూ కట్టర్ ద్వారా తల, కాళ్లు, కడుపు భాగాలను కత్తిరించి కారులో బయటకు తరలించాలనుకున్నాడు. వీలు కాకపోవడంతో అలాగే వదిలేసి ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయాడు. దర్యాప్తులో భాగంగా హేమంత్ మోతేను అదుపులోకి తీసుకొని కూకట్‌పల్లి మూడో మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్, ఏడీజే కోర్టు ఎదుట హాజరు పర్చారు. విచారణ జరిపిన కోర్టు బుధవారం నిందితుడైన హేమంత్ మాతెకు జీవితఖైదు విధించారు. రూ.10 వేల జరిమానా విధించినట్లు కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపారు.